# 4

# పాప దోషమును జయించడం

"ఓటమికై పుట్టినోడు" అన్న హాస్య చళుకలు నేనొక వార్తా పత్రికలో చూచి ఎంతో సంతోషించాను. ఎందుకంటే, దాంట్లోని ప్రధాన పాత్రయైన వ్యక్తితో నేను ఏకీభవించాను కాబట్టి. నేను కూడ "ఓటమికై పుట్టినవానిలా" తరచు బాధపడేవాణ్ణి. అనేకసార్లు పరిస్థితులు తారుమారవతాయి, విజయం లభించదు, సమస్యలు తలెత్తుతాయి. అసలు నాతో నాకే సందేహమొస్తుంది. "నేనసలు గెలువగలనా?" అని కూడ.

నాకు, నీలాంటివారికి అనగా ఎప్పుడూ ఓటమికి గురియైనవాళ్ళలా బాధచెందేవారికి ఒక శుభవార్త ఏమనగా, విజయమనేది తప్పక దక్కుతుంది సుమా! పౌలు చెప్పిన రీతిగా యేసు ద్వారా "అత్యధిక విజయము పొందుచున్నాము" (రోమీయులకు 8:37; RSV). అపొస్తలుడైన యోహాను దీన్ని గురించి 5:4, 5లో సాక్ష్యమిస్తున్నాడు,

> దేవుని మూలముగా పుట్టినవారందరును లోకమును జయించుదురు;
> లోకమును జయించిన విజయము మన విశ్వాసమే. యేసు దేవుని కుమారుడని నమ్మువాడు
> తప్ప లోకమును జయించువాడు మరి ఎవడు?

మనం "లోకాన్ని జయించవచ్చు" సుమా! లోకం అంతా పాపభూయిష్టమై ఉన్నది కాబట్టి మనం పాపాన్ని జయించగలం అంటూ 1 యోహాను 2:15-17లో యోహాను అంటున్నాడు. 1 యోహాను పత్రిక యొక్క ప్రాముఖ్యమైన సారాంశమేమంటే, "పాపము పై విజయాన్ని" ప్రతి క్రైస్తవుడు, క్రైస్తవురాలు పొందుట సాధ్యం అని.

పాప దోషమును మనం క్రీస్తు ద్వారా జయించవచ్చు. మనం పాపం చేయడం ద్వారా దేవునికి బాధ కలిగిస్తాం అందువల్ల ఆయన దృష్టిలో అపరాధులమవుచున్నాం అంటూ బైబిలు అనేక రీతులుగా బోధించుచున్నది. మన పాపములు మనలను దేవునికి దూరం చేస్తున్నాయి (యెషయా 59:1, 2; ఎఫెసీయులకు 2:12 చూడు). ఎలాగైనా క్రీస్తు చేసిన త్యాగము ద్వారా మన గత పాపాలు క్షమించబడతాయి అని కూడ బైబిలు ప్రబోధించుచున్నది. క్రైస్తవుడు పాపంచేసినా ఆ పాపాలు కూడ క్షమించబడతాయి అని కూడ బైబిలు తెల్పుచున్నది.

## గతంలోని పాపాల దోషం

"పాపములను తీసివేయుటకై ఆయన ప్రత్యక్షమాయెనని మీకు తెలియును" అని 1 యోహాను 3:5లో మనకు తెలుపబడింది. 3:16లో "ఆయన మన నిమిత్తము తన ప్రాణము పెట్టెను" అని చెప్పబడింది. మరియు ఆయన "మన పాపములకు ప్రాయశ్చిత్తమై యుండుటకు" మరియు "లోక రక్షకుడిగా ఉండుటకు" (1 యోహాను 4:9, 10, 14) మరియు "ఆయన ద్వారా మనం జీవించునట్టు" దేవుడు తన కుమారుని లోకములోనికి పంపెను. యేసును గూర్చి యోహాను "ఆయనే మన పాపములకు శాంతికరమైయున్నాడు" (1 యోహాను 2:2) అంటున్నాడు. అప్పుడు "పాపములు క్షమించబడినవి" (1 యోహాను

2:12) అని ఎలాంటి అనుమానం లేకుండ మనం నమ్ముచున్నాము.

అందుచేత మనము విశ్వాసంవలన ఆయన పిల్లలముగా అయినాము (1 యోహాను 5:1) గనుక క్రైస్తవులముగా మన పాపములు దేవుని మహా కృపచేత క్షమించబడినాయి. క్షమించబడడానికి కావలసిన ముఖ్యమైన మొదటిదైనది విశ్వాసమే. యోహాను యిలా అంటున్నాడు, "లోకమును జయించిన విజయము మన విశ్వాసమే" (1 యోహాను 5:5ఎ చూడు).

బహుశ, యిక్కడ, విశ్వాసం - యేసు యొక్క దైవత్వాన్ని అంగీకరించుటవలన - ఒకడు దేవుని బిడ్డగా చేయబడడు. ఒక పాపి యేసు యొక్క దైవత్వాన్ని అంగీకరించినందున అతనిని తన పాపాల విషయములో మారుమనస్సు పొంది క్రీస్తు యేసులోనికి బాప్తిస్మమందు ప్రభువునకు (అపొస్తలుల కార్యములు 2:38) విధేయతను చూపుటకు నడిపించినప్పుడు అతని పాపాలు క్షమించబడతాయి. అప్పుడే అతను తన గత పాప దోషమునుండి విజయం పొందిన నిజమైన ఆనందాన్ని అనుభవించగలడు.

## ఇప్పటి పాపాల దోషం

గతంలోని పాపాలపై విజయాన్ని ప్రసాదించడమే గాక యేసు తన శిష్యులైనవారికి యిప్పటి పాపాలమీద కూడ జయాన్ని అనుగ్రహించగలడు. మనం పాపం చేసినయెడల, మనకు తండ్రియొద్ద ఉత్తరవాది కలడు, నీతిమంతుడగు యేసు క్రీస్తు (1 యోహాను 2:1). యింకా ముందుకు చెప్పాలంటే, "అయితే ఆయన వెలుగులోనున్న ప్రకారము మనమును వెలుగులో నడిచినయెడల, ... ఆయన కుమారుడైన యేసు రక్తము ప్రతి పాపములనుండి మనలను పవిత్రులనుగా చేయును" (1 యోహాను 1:7). మరియు "మన పాపములను మనము ఒప్పుకొనినయెడల, ఆయన నమ్మదగినవాడును నీతిమంతుడును గనుక ఆయన మన పాపములను క్షమించి సమస్త దుర్నీతినుండి మనలను పవిత్రులనుగా చేయును" (1 యోహాను 1:9).

క్రైస్తవులనబడిన వారమైన మనం యేసు రక్తమువలన మనకు పాపక్షమాపణ లభించిందని నమ్మాలి. మనం ఒక సారి మన పాపాల విషయమై పశ్చాత్తాపపడి పాపాలు ఒప్పుకున్న తర్వాత కూడ యింకా అపరాధ భావనతో చలించిపోతున్నామంటే, దేవుని శక్తి సామర్థ్యాలనే శంకిస్తున్నామని అర్థమవుతుంది. ఆయన ఎంతో యిష్ట పూర్తిగా చేస్తానని చెప్పిన మాటలను కూడ మనం సందేహిస్తూ నమ్మడం లేదన్న మాట. ఒక్కసారి మనం మన పాపాలకు క్షమాపణపొందిన తర్వాత యిక ఆ దోషం మనలను యింకా కృంగదీయ నివ్వరాదు. క్రైస్తవులు వారి పాప దోషం పై విజయం సాధించుచునేవుండాలి.

## ముగింపు

పాపాన్ని జయించడానికి కావలసిన మార్గాన్ని యేసు అనుగ్రహించడానికి వచ్చారు. ఆయన తన స్వరక్తం ద్వారా పాపానికి వెల చెల్లించి మార్గాన్ని సరాళం చేశాడు. సువార్తకు విధేయత చెపుతూ వెలుగులో నడిచేవారికి ఆయన గొప్ప రక్షణ అనేది ఒక వాస్తంగా నిలిచిపోయింది.